సాక్షి
వికారాబాద్

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



న్యూస్‌రీల్

ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభం



మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు

తాండూరు టౌన్: అఖిల భారత మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో తొలిరోజు రాజస్థానీ మహిళా మండలి సభ్యులు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్‌సార్డా మాట్లాడుతూ.. ఆరేళ్లుగా ప్రతీ వేసవి కాలంలో ప్రయాణికులకు వంద రోజుల పాటు ఉచితంగా మజ్జిగ అందజేస్తున్నామని తెలిపారు. సంఘం అధ్యక్షుడు బ్రిజ్ మోహన్ బూబ్ మాట్లాడుతూ.. యువమంచ్ సంఘం, సభ్యుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంచ్ ప్రతినిధులు రమేష్ చంద్ర బూబ్, ఓంప్రకాష్ సోమానీ, రామానుజదాస్ సోనీ, సంపత్ సార్డా, భగవాన్‌దాస్ బూబ్, అరుణ్ సార్డా, కిషన్ రాఠి, కరన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రంజాన్ కిట్ల పంపిణీ



తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న రంజాన్ కిట్లు

తాండూరు రూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లింలకు ప్రభుత్వం అందజేస్తున్న పండుగ కానుకలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. నియోజకవర్గానికి 2,500 కిట్లు చొప్పున అందజేస్తోంది. బుధవారం వీటిని పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చిన్నప్పలనాయుడు తెలిపారు. ఇఫ్తార్ విందు కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: అపోలో ఫార్మసీ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాల కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వికారాబాద్‌లో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్‌తో పాటు వివిధ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారు మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్: 9676047444లో సంప్రదించాలని తెలిపారు.

మాంసం వ్యర్థాల తరలింపునకు వేలం

తాండూరు టౌన్: పట్టణ పరిధిలోని మటన్, చికెన్, చేపల దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాల తరలింపునకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న ఉదయం 11 గంటలకు కొత్త మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని సూచించారు.

నేడు ధారూరులో ఇఫ్తార్ విందు

ధారూరు: మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ భువనేశ్వర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ముస్లింలు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. అనంతరం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు.



అట్టహాసంగా లంకాదహనం

తాండూరులోని భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో భాగంగా లంకా దహన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. 8లో ▸



పాలన అ‘ద్వితీయం’

ఢిల్లీలో కేంద్ర మంత్రి గిరిరాజాసింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ నర్సింహారెడ్డి, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ

చీమల్‌దరి సర్పంచ్ నాసన్‌పల్లి నర్సింహారెడ్డి జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలో సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజాసింగ్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. సుపరిపాలన విభాగంలో చీమల్‌దరి దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలవడంపై కేంద్ర మంత్రి అభినందించారు. రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, పంచాయతీ కార్యదర్శి సుగుణతో కలిసి సర్పంచ్ అవార్డు స్వీకరించారు.

– మోమిన్‌పేట



అలంకారం.. అర్ధనారీశ్వరం

భావిగి భద్రేశ్వర దేవస్థానంలోని శివాలయంలో సోమవారం పరమశివుడు అర్ధనారీశ్వరుడిగా దర్శనమిచ్చాడు. అర్చకుడు విజయకుమారస్వామి మహాదేవుడిని సుందరంగా అలంకరించారు. అర్ధనారీశ్వరుడి రూపంలో ముస్తాబైన ముక్కంటిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

– తాండూరు టౌన్

పత్తాలేని పరిహారం!

నేల తల్లిని నమ్ముకుని కోటి ఆశలతో వ్యవసాయం చేస్తున్న రైతన్నకు ఏటా నష్టాల దిగుబడే మిగులుతోంది. మూడేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల బారిన పడుతున్న పంటలు చేతికందే సమయంలో వర్షార్పణమవుతున్నాయి. పరిహారం అందించాల్సిన పాలకులు పట్టించుకోకపోవడంతో అన్నదాత పరిస్థితి దయనీయంగా మారుతోంది.

వరుస నష్టాలతో రైతన్న కుదేలు

- సర్వేలతోనే సరిపెడుతున్న అధికారులు, పాలకులు
- మూడేళ్లుగా అందని పరిహారం
- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు

వికారాబాద్: పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో వర్షార్పణమవుతున్నాయి. జిల్లాలో మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. భారీ వర్షాలు, వడగళ్లు కురిసిన సమయంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన పాలకులు, అధికారులు పరిహారం అందిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి.

హైకోర్టు ఆదేశించినా..

పాడైన పంట పొలాలను చూసి సానుభూతి వ్యక్తంచేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఆతర్వాత కొద్ది రోజులకే ఈ విషయాన్ని మర్చిపోతున్నారు. దీంతో రైతులకు పరిహారం అందించే అంశాన్ని పట్టించుకునే వారే లేకుండా పోతున్నారు. నష్టపోయిన వారికి ఎకరాకు రూ.లక్ష సాయం అందించాలని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు చేసిన హడావుడి ఒకటి రెండు రోజులు మీడియాలో వార్తలకే పరిమితమైంది. నష్టంపై అధికారులు సమర్పించిన నివేదికల్లో ఇప్పటికీ కదలిక లేదు. బాధిత రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించినా.. ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. మూడేళ్లుగా రైతులు నష్టపోవడం.. ఇచ్చిన హామీలను నేత లు విస్మరించడం పరిపాటిగా మారింది. గతేడాది పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా ఇప్పటి వరకు స్పందన లేదు.

వేలాది ఎకరాల్లో నష్టం

గడిచిన మూడు సీజన్లలో జిల్లాలో వరుసబెట్టి అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కనీవినీ ఎరగని రీతిలో ఇటీవల కురిసిన వడగండ్లతో పంటలకు ఊహించని నష్టం వాటిల్లింది. ఇందులో ఉద్యాన పంటలు బాగా దెబ్బతిన్నాయి.



ఇటీవల కురిసిన వర్షాలతో పాడైన టమాటా పంటను చూపిస్తున్న రైతు

మూడు నివేదికలు

వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నష్టపోయిన పంటలకు సంబంధించి సర్వే వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించారు. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించడంతో 2005 ఎకరాల్లో పంటలు నష్టపోయారని మొదటి నివేదికలో.. 3,500 ఎకరాల్లో పంటలు పాడయ్యాయని రెండో నివేదికలో.. సమగ్ర సర్వే అనంతరం వారం రోజుల తర్వాత మొత్తం 6,500 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు మూడు నివేదికలిచ్చారు. ఇందులో ప్రభుత్వం దేన్ని పరిగణనలోకి తీసుకుంటుందనే అంశంపై స్పష్టత కరువైంది.




మర్పల్లిలో ఇటీవల కురిసిన వడగండ్లు (ఫైల్)

మూడేళ్లుగా నష్టం

2020లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం 1.25 లక్షల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. మరుసటి ఏడాది సైతం ఇదే తరహాలో భారీ వర్షాలు కురవడంతో 25 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు నివేదించారు. వరుసగా ఈ ఏడాది కూడా వానాకాలంలో భారీ వర్షాలు కురవగా 2వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలపై వడగండ్లు కురవడంతో 6వేల ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయి.

ప్రభుత్వానికి నివేదించాం



వరుసగా మూడు వ్యవసాయ సీజన్లలో కురిసిన భారీ వర్షాలతో పంటలు పాడయ్యాయి. సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదికం పంపించాం. ఈ ఏడాది కూడా నష్టపోయిన పంటలకు సంబంధించి మండలాల వారీగా వివరాలు అందజేశాం. పరిహారం చెల్లింపు అంశం ప్రభుత్వం పరిధిలో ఉంది. దీనిపై మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

సమస్యలపై తిప్పుకోవద్దు

- ప్రజావాణి ఫిర్యాదులను ప్రాధాన్యమైనవిగా గుర్తించాలి
- అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పలు సమస్యలకు సంబంధించి మొత్తం 266 వినతులు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవారం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు.. వచ్చే వారం మళ్లీ రాకూడదని సూచించారు. ఒకే సమస్యపై కొంత మంది నెలల తరబడి తిరుగుతున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. పరిష్కరించలేని సమస్యలు ఉన్నట్లయితే బాధితులకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టంచేశారు. ప్రజావాణికి వచ్చే ప్రతీ దరఖాస్తును అత్యంత ప్రాధాన్యం కలిగినదిగా గుర్తించాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దని ఆదేశించారు. జిల్లా ఐడీసీఓ గార్డెన్.. రాష్ట్ర ఉత్తమ గార్డెన్‌గా ఎంపిక కావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తంచేశారు. కలెక్టర్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిత్యం పరిశుభ్రత, గార్డెనింగ్ పనులు చేపట్టి అవార్డులను నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అందజేసిన ట్రోఫీని తన చేతులమీదుగా హార్టికల్చర్ అధికారులకు అందజేశారు.

యాప్ ఆధారంగానే జీతాలు

గత నెల మాదిరిగానే ఈ నెల కూడా అటెండెన్స్ యాప్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ యాప్ ఆధారంగానే జీతభత్యాలు చెల్లిస్తామని స్పష్టంచేశారు. ఈ విషయంలో అన్ని శాఖల బాధ్యులు పక్కాగా వ్యవహరించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గతవారం జగ్జీవన్‌రామ్, జ్యోతిబాపూలే, అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించిన అధికారులను ప్రశంసించారు. అధికారిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ప్రొటోకాల్ విధిగా పాటించాలని, ఎలాంటి తప్పులు జరగకుండా చూస్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 కోట్ల నిధులు విడుదల

తాండూరు: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పనుల కోసం రూ.40 కోట్ల నిధులను మంజూరు చేస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కింద సీఎం కేసీఆర్ ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేశారు. ఇందులో భాగంగా 2022– 23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు రూ.40 కోట్లు మంజూరయ్యాయి. ఇదిలా ఉండగా తాండూరు నియోజకవర్గంలో 107 పనుల కోసం రూ.9.99 కోట్లు కేటాయించారు. త్వరలోనే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభం కానున్నాయి. గతంలో ఏనాడూ లేని విధంగా ఎమ్మెల్యే చొరవతో ఒకేసారి 134.46 కోట్ల నిధులు కేటాయిస్తూ మార్చి 29న కలెక్టర్ శాఖాపరమైన ఉత్తర్వులు జారీ చేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చేవెళ్లపై కమలం గురి

- 23న రానున్న అమిత్‌షా?
- ఏర్పాట్లలో పార్టీ శ్రేణులు
- ఉమ్మడి జిల్లా నుంచి పలువురు నేతల చేరిక!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భారతీయ జనతాపార్టీ ఎన్నికల సమరానికి సన్నద్ధం అవుతోంది. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కమల నాయకత్వం.. జిల్లాలో భారీ బహిరంగసభకు ప్లాన్ చేసింది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల లేదా వికారాబాద్‌లో ఈ నెల 23న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన దాదాపు ఖరారు కావడంతో సభను సక్సెస్ చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. సోమవారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో జిల్లా పార్టీ నేతలు సమావేశమయ్యారు.

చేరికలకు ముహూర్తం!

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై పట్టు బిగించాలని ప్రయత్నిస్తున్న కాషాయదళం అధి నాయకత్వాన్ని జిల్లాకు రప్పించి.. పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇతర పార్టీల్లోని అసంతృప్తులను చేరదీయడం ద్వారా బలపడాలని యోచిస్తోంది. ఈ క్రమంలోనే కీలక నేతలకు గాలం వేస్తోంది. అమిత్ షా సభలో ఓ మాజీ మంత్రిని చేర్చుకునేదిశగా ఎత్తులు వేస్తోంది. అధికారపార్టీ నేతలకు గాలం వేసి ‘గులాబీ’ని అస్థిరపర్చేలా ప్లాన్ చేస్తోంది.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు

తాగునీటికి ఆందోళన

పది రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంతారం మహిళలు మండిపడ్డారు. సోమవారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యను చెబితే సర్పంచ్ కృష్ణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై సర్పంచ్‌ను వివరణ కోరగా మిషన్ భగీరథ నీటి సరఫరాలో కలిగిన అంతరాయం కారణంగా సమస్య ఎదురైందని, రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

– కుల్కచర్ల

క్లుప్తంగా

అన్ని వర్గాల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



మహిళలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం ముస్లింలకు పంపిణీ చేస్తున్న కానుకలను సోమవారం పరిగిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. కుల మతాలకు అతీతంగా పాలన చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ కానుకలను ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్ మహమూద్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు మౌలానా పాల్గొన్నారు.

ఆడుతూ పాడుతూ ఉపాధి పనులకు..



బాజాభజంత్రీలతో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు

మోమిన్‌పేట: ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపు సొలుపు ఉండదులే... అన్న సినిమా పాటకు తగ్గట్లుగా ఉపాధి కూలీలు బాజా భజంత్రీలతో పనులకు వెళ్తున్నారు. మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో 128 మంది ఉపాధి కూలీలు ఉదయం 7గంటలకు బాజా భజంత్రీలతో అందరూ ఒకేసారి పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి బాజా భజంత్రీలతో గ్రామానికి వచ్చారు. ఎర్రటి ఎండలో పనులు చేస్తున్నప్పటికీ సంతోషంగా, ఆనందంగా చేయాలనే ఈ బాజా భజంత్రీలు అంటున్నారు ఉపాధి కూలీలు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం



ఇంటి నుంచి వస్తున్న పొగలు

బషీరాబాద్: మండల కేంద్రంలోని ఇంద్రానగర్‌లో సోమవారం ఓ ఇల్లు పాక్షికంగా దగ్ధం అయ్యింది. వివరాలు.. గ్రామానికి చెందిన శాంతప్ప ఉదయం ఇంట్లో పూజ చేసి దీపం వెలిగించాడు. అనంతరం ఇంటికి తాళంవేసి బయటకు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వాళ్లు సర్పంచ్ ప్రియాంకు సమాచరం అందించారు. వెంటనే గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో నీళ్లు చల్లించారు. అనంతరం తాండూరు నుంచి ఫైర్ ఇంజన్ రప్పించి మంటులను పూర్తిగా ఆర్పివేయించారు. ఇళ్లు తెరిచి చూడగా ఇంట్లో దాచిన రూ.50వేలు కాలిబూడిదయ్యాయి. అలాగే ప్లాట్ల డ్యాక్యుమెంట్స్, ఎల్ఐసీ బాండ్లు దగ్ధం అయినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

‘లక్ష్య, ముస్కాన్’కు అర్హత సాధించేనా?

- తాండూరు మాతాశిశు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం
- గర్భిణులు, చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా
- రికార్డుల పరిశీలన
- ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ పొందితేనే కేంద్ర నిధులు



రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యురాలు డాక్టర్ నివేదిత

తాండూరు టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులు, పిల్లలకు అందుతున్న సేవల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. అయితే ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ పొందిన ఆస్పత్రులకే ఈ అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగా సోమవారం తాండూరులోని మాతా శిశు కేంద్రాన్ని నేషనల్ హెల్త్ మిషన్ బృందం సభ్యులు సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన లక్ష్య(లేబర్ రూమ్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇనిషియేటీవ్) స్కీం, అలాగే ముస్కాన్ (స్మైల్) స్కీం అర్హతలపై ఇద్దరు కేంద్ర బృందం సభ్యులు ఆస్పత్రిలో తనిఖీలు చేశారు. డాక్టర్ మౌనికా రాణా, డాక్టర్ నివేదితలు ఆస్పత్రిలోని లేబర్ రూం, మెటర్నిటీ ఓపీ, వార్డు, అలాగే పిల్లల ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, ఓపీ, వార్డులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అయితే రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి గర్భిణులు, పిల్లలకు అందుతున్న సేవలపై పూర్తి సమాచారం సేకరించనున్నారు. సోమవారం పలు రికార్డులను పరిశీలించిన సభ్యులు, మంగళవారం గర్భిణులు, పిల్లలకు అందుతున్న సేవలను నేరుగా తెలుసుకోనున్నారు. గర్భిణులు ఆస్పత్రికి వచ్చింది మొదలుకొని ఇంటికి వెళ్లే వరకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయనున్నారు. రికార్డుల నిర్వహణ, అందుతున్న సేవలపై కేంద్ర బృందం సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ వస్తే..

ప్రభుత్వ ఆస్పత్రులు ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ పొందితే పలు ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఈ సర్టిఫికెట్ పొందాలంటే వైద్య సేవల్లో 70శాతం పైగా మార్కులు సాధించాలి. ఈ అర్హత సాధిస్తే కేంద్రం నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలోని ఒక్కో బెడ్‌కు 10 వేల రూపాయలు ఐదేళ్ల పాటు అందే అవకాశం ఉంటుంది. ఈ నిధులతో ఆస్పత్రికి అత్యాధునిక పరికరాల కొనుగోలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను వినియోగించుకోవచ్చు. అయితే తాండూరు పట్టణంలోని 150 పడకల మాతా శిశు ఆస్పత్రి ఈ స్కీంకు అర్హత సాధిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

గొర్రెల యూనిట్లకు దరఖాస్తు చేసుకోండి

పశు సంవర్ధక శాఖ ఏడీ ప్రహ్లాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ ప్రహ్లాద్‌కుమార్

మోమిన్‌పేట: రెండో విడత గొర్రెల పంపిణీ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ ప్రహ్లాద్‌కుమార్ సూచించారు. సోమవారం మోమిన్‌పేటలోని రైతు వేదికలో గొర్రెల కాపరులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో గొర్రెల యూనిట్‌ని పొందని వారు రెండో విడతకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేయాలన్నారు. ఒక్కో యూనిట్‌లో ఒక పొట్టేలు, 20 గొర్రెలు ఉంటాయన్నారు. పొట్టేలుకు రూ. 10వేలు, 20 గొర్రెలకు రూ. 1,48,000లు, రవాణా ఖర్చులకు రూ. 6,500లు, దాణాకు రూ. 3500లు, మందుల కోసం రూ. 500లు, గొర్రెలకు బీమాకు రూ. 5000లు, ఇతర ఖర్చుల కోసం రూ. 1500లు మొత్తం యూనిట్‌కు రూ. 1,75,000 ఉంటుందని తెలిపారు. ఇందులో లబ్ధిదారుడి వాటా 25శాతం (రూ. 43,750లు), ప్రభుత్వ వాటా 75శాతం (రూ. 1,31,250) అవుతుందన్నారు. లబ్ధిదారుడు వాటా మొత్తాన్ని తన బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే స్వీకరించనున్నట్లు తెలిపారు. మండలంలో రెండో విడతకు 575మంది లబ్ధిదారులు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. దరఖాస్తులను మండల పశు వైద్యాధికారికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి గీత, అసిస్టెంట్ వైద్యాధికారులు మదన్‌మోహన్, శివరామ హరి, వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

పండుగలతో మనస్సుకు ప్రశాంతత

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: పండుగలతో మనస్సుకు ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బొంరాస్‌పేటలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు ప్రభుత్వం తరఫున కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తిభావాన్ని, సోదరభావాన్ని పంచే పవిత్ర మాసం రంజాన్ అన్నారు. ముస్లింల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం షాదీముబారక్ లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి, నరేశ్‌గౌడ్, బసిరెడ్డి, రాంనాయక్, వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌లో దేవతా విగ్రహాల ధ్వంసం

పీఎస్‌లో కేసు నమోదు

బంట్వారం: మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం గ్రామ దేవతల విగ్రహాలను ధ్వంసం చేశారు. పోచమ్మ నాగుల ఆలయంలోని దేవతామూర్తుల విగ్రహాలను చెల్లాచెదురుగా పడేశారు. మధ్యాహ్నం ఆలయానికి వెళ్లిన గ్రామస్తులు విగ్రహాలు చెల్లాచెదరుగా పడిఉండటం గమనించారు. స్థానిక సర్పంచ్ నర్సింహులు.. విగ్రహాల ధ్వంసం విషయమై బంట్వారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

దోమ: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విశ్వజన్ కథనం మేరకు.. కుల్కచర్ల మండలం గోప్యానాయక్ తండాకు చెందిన రాంచందర్(35) పనుల కోసం వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పాడు. అయితే దోమ మండలం ఐనాపూర్ గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విశ్వజన్ తెలిపారు. ఇదిలా ఉండగా భర్త మృతిపై భార్య గంగ అనుమానం వ్యక్తం చేసింది. పనుల కోసం దోమ మండలంలోని పాలేపల్లికి వెళుతూ వచ్చేవాడని, రెండు రోజుల క్రితం పాలేపల్లిలో ఓ వ్యక్తితో గొడవ జరిగినట్లు తెలిపారు. ఈ కారణంగానే తన భర్తను చంపేసి ఉంటారని ఆమె ఆరోపించారు. తన భర్త చావుకు కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వేడుకుంది.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం



రాము మృతదేహం

మోమిన్‌పేట: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మోమిన్‌పేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మొరంగపల్లికి చెందిన సీ రాము(30) భార్య సుజాత, తండ్రి మల్లయ్యతో ఈ నెల 15వ తేదీ గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం మోమిన్‌పేట నందివాగు ప్రాజెక్టులో శవమై తేలాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ ప్రకాశ్ తెలిపారు.

సీఈఐఆర్ అప్లికేషన్‌తో సెల్‌ఫోన్ చోరీలకు చెక్

అనంతగిరి: సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) అప్లికేషన్‌తో సెల్‌ఫోన్ దొంగల భరతం పడతామని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చోరీకి గురైన, పోయిన ఫోన్‌ను కనుగొనేందుకు కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ నూతన అప్లికేషన్ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఈ అప్లికేషన్‌ను పోలీసు యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా వినియోగించుకుని అవకాశం ఉందని తెలిపారు. నూతన విధానంపై అన్ని పోలీస్‌స్టేషన్ల రైటర్లు, ఎస్ఐలకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సులు

వికారాబాద్ అర్బన్: రెండో విడత గొర్రెల పంపిణీపై ఈ నెల 21వ తేదీ వరకు జిల్లాలోని గ్రామాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి అనీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో గొర్రెల పెంపకం దారులకు యూనిట్లపై లబ్ధిదారుల వాటా, ప్రభుత్వం వాటాపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ప్రాథమిక గొర్రె కాపరుల సహకార సంఘంలో సభ్యత్వం ఉండాలన్నారు. 2017 మే నాటికి 18 సంవత్సరాలు పైబడి వారు అర్హులన్నారు. సభ్యుడి పేరు డాక్టర్ వద్ద ఈ - లాబ్‌లో నమోదై ఉండాలన్నారు.

అట్టహాసంగా లంకాదహనం



ఉత్సవాల్లో పాల్గొన్న బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, భక్తజనం

తాండూరు: పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో భాగంగా సోమవారం తెల్లవారుజామున లంకా దహన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆదివారం రాత్రి ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. వందలాది మంది భక్తుల సమక్షంలో బస్వణ్ణ కట్ట సమీపంలోని లంకా దహన ప్రాంగణానికి చేరుకుంది. సోమవారం తెల్లవారుజామున ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్, ఉత్సవ కమిటీ చైర్మన్ బంటారం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: విద్యార్థులకు ఉత్తమ బోధన తోపాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. గుడ్ మార్నింగ్ కొడంగల్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం ఉదయం పట్టణంలోని మహాత్మా జ్యోతి రావ్ పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా పెడుతున్నారని ఆరా తీశారు. వంట గదికి వెళ్లి అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో నాణ్యమైన భోజనం కూడా అంతే ముఖ్యమన్నారు. అనంతరం బండల ఎల్లమ్మ ఆలయం నుంచి తిర్లాపూర్ అడవికి వెళ్లే దారిని పరిశీలించారు. రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ఉన్న పానాది రోడ్డును పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా రోడ్డు సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుయాదవ్, మాజీ సర్పంచు రమేష్ బాబు, నాయకులు దాసప్ప యాదవ్, రామూనాయక్, నవాజ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- వికారాబాద్‌లో ఫైర్ సేఫ్టీ క్యాండిల్ ర్యాలీ

అనంతగిరి: అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. అగ్ని మాపక వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పట్టణంలో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండాకాలంలో ఎండలు తీవ్రంగా ఉండటం వలన అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్, పోలీసు, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలోని కమర్షియల్ భవనాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించే విధంగా చూడాలని ఆదేశించారు. గృహాల్లో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్, ఏఎస్పీ మురళీధర్, జిల్లా ఫైర్ అధికారి సుధాకర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, డీఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డొనేషన్‌ల పేరిట దగా



బాధిత తల్లిదండ్రుల నుంచి ప్రామిసరి నోట్ తీసుకుంటున్న సీఐడీ అధికారులు



ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

- ఒక్కో విద్యార్థి నుంచి రూ. 3-5లక్షల వసూలు
- డిపాజిట్ డబ్బులు తిరిగి ఇచ్చేందుకు నిరాకరణ
- కేశవరెడ్డి స్కూల్ యాజమాన్యంపై బాధితుల ఆగ్రహం
- న్యాయం చేస్తాం: సీఐడీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి

అనంతగిరి: మన్నెగూడ కేశవరెడ్డి స్కూల్‌లో డొనేషన్‌లు కట్టి మోసపోయిన తమకు న్యాయం చేయాలని తెలంగాణ కేశవరెడ్డి స్కూల్స్ డిపాజిట్‌దారుల బాధితుల సంఘం కోరింది. సోమవారం వికారాబాద్‌లో బాధితులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల నుంచి 3 నుంచి 5 లక్షల వరకు డొనేషన్‌లు తీసుకున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్ నుంచి బయటకు వెళ్లే సమయంలో మొత్తం డొనేషన్ నగదును తిరిగి ఇస్తామనడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్‌లు తీసుకున్నారు. ఈ విషయమై యాజమాన్యం ప్రామిసరి నోట్ కూడా రాసిచ్చిందన్నారు. కానీ చదువు పూర్తయినా డబ్బులు ఇవ్వలేదు. తమకు న్యాయం చేయాలని వారు సీఐడీ అధికారులను ఆశ్రయించారు.

న్యాయం జరిగేలా కృషి

బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని సీఐడీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు పాఠశాల యాజమాన్యంపై నాలుగు కేసులు నమోదయ్యాయని, వాటిని సీఐడీ విచారిస్తుందన్నారు. కేశవరెడ్డి ఆస్తులను అటాచ్ చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకుని కోర్టులో సమర్పిస్తామన్నారు. ప్రస్తుతం కేసు చార్జిషీట్ వేసేస్థాయికి చేరిందన్నారు. అన్ని బ్రాంచ్‌లలో ఇదే తంతును కొనసాగిస్తూ తల్లిదండ్రుల నుంచి నగదు తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. వికారాబాద్ 651 బాధితుల్లో 481మంది డాక్యుమెంట్లు సమర్పించారని, రాష్ట్రవ్యాప్తంగా 1,621 మంది బాధితులు ఉన్నారన్నారు.

పథకాల అమలులో మనమే ఆదర్శం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ముస్లింలకు ప్రభుత్వం తరఫున రంజాన్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం కూడా కల్యాణలక్ష్మి, షాదీమురక్ వంటి పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఈ పథకాల ద్వారా పేదింటి యువతుల వివాహాలకు రూ. 1,00,116 అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. అన్నదాతల కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. సీఎం సహాయ నిధి ద్వారా నియోజవర్గానికి అధిక నిధులు తెచ్చి పేదలను ఆదుకోవడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ సీ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ నయిమొద్దీన్, కమిషనర్ జ్ఞానేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

చేవెళ్ల: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం వెంకట రంగారెడ్డి, వైస్ చైర్మన్ బీ నర్సింలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచులు శైలజ, మల్లారెడ్డి, శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు టీ చంద్రశేఖర్, నాయకులు ఎం కృష్ణారెడ్డి, పీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలనే ప్రభుత్వం కానుకలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్, నాయకులు బాసిత్, ఖాదర్, గని తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన ఉండాలి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ స్వామీజీ

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని రుద్రస్వామి అలియాస్ హరికృష్ణ అన్నారు. సోమవారం ఆయన శ్రీపాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాము హిందూ ధర్మపరిరక్షణకు కృషిచేస్తున్నాము తప్పిస్తే ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడటంలేదని అన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాగా స్వామిజీని అంటూ మోసపూరితంగా ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటున్నారన్న ఫిర్యాదుతో పోలీసులు రుద్రస్వామి(హరికృష్ణ)పై చీటింగ్ కేసు నమోదు చేసి పరిగి సబ్ జైలుకు తరలించారు. బెయిల్‌పై వచ్చిన ఆయన సోమవారం పాంబండపై శ్రీరామలింగేశ్వరుడికి అభిషేకం నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, లింగంగారి రాములు, శంకర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-19]

WANTED

■ ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న యువతి యువకులకు, గృహిణులకు గొప్ప అవకాశం. నెలకి మంచి ఆదాయం. 25,000 పైన సంపాదన. 100% genuine opportunity ✆ 80745 45356 [B-044]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్:9640528899. [H-793415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.